



అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 09 జూన్ 2026 పేజీలు : 04


# పరిగి ప్రజా దర్బార్‌లో మంత్రి సవిత సంచలన ప్రకటన

- "త్వరలో అర్హులందరికీ హౌసింగ్, పెన్షన్లు 723 మందికి పొజిషన్ పత్రాలు"
- ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించిన మంత్రి




మాట్లాడుతున్న మంత్రి సవిత



ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న దృశ్యం



ఇంటి పొజిషన్ సర్టిఫికెట్స్ అందజేస్తున్న మంత్రి

**పరిగి జూన్ 8(ప్రభాత వార్త)**

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన అజెండా అని రాష్ట్ర మంత్రి సవిత పునరుద్ఘాటించారు. సత్యసాయి జిల్లా పరిగి మండల కేంద్రంలో సోమవారం భారీ ఎత్తున నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి నేరుగా వినతులు, అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీకి పరిష్కారం వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. రేషన్ కార్డులు, భూ సమస్యలు, పెన్షన్లు, రోడ్లు, తాగునీరు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ప్రజల కష్టాలు తెలుసుకుని వాటికి తక్షణ పరిష్కారం చూపడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అందిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులకు పంపించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హౌసింగ్, పెన్షన్లపై భరోసా ప్రభుత్వ సేవలు ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీగా అందేలా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు తెలుసుకునేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. "ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలి. వాటి పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంది" అని హామీ ఇచ్చారు. అలాగే త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీ హౌసింగ్ పథకం కింద ఇళ్లు, సామాజిక భద్రతా పెన్షన్లు అందజేస్తామని ప్రకటించారు. ప్రజా దర్బార్ అనంతరం మంత్రి సవిత 723 మంది లబ్ధిదారులకు ఇంటి పొజిషన్ పత్రాలను అందజేశారు. దీంతో ఆ లబ్ధిదారులకు ఇంటి స్థలంపై పూర్తి హక్కు లభించినట్టయింది. లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనందరావు, సాగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, పలు శాఖల జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు,మండల కన్వీనర్ ఎస్ ఎన్ గోవింద్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డెహనమయ్య, తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, ఏపీ పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వెంకటేష్,జిల్లా అధికార ప్రతినిధి బాలాజీ, కార్యకర్తలు, భారీ సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రైతు,ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం...!

- అభివృద్ధిపై అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ కీలక ఆదేశాలు...! - విద్యుత్, నీరు, అభివృద్ధిపై మంత్రి సత్యకుమార్ ప్రత్యేక సమీక్ష



ప్రజలతో అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి. కలెక్టర్

**ధర్మవరం, జూన్ 08, ప్రభాతవార్త**

ధర్మవరం కోర్టు హాల్‌లో శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ గారితో పాటు జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులతో ధర్మవరం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ,వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ పాల్గొని వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... ధర్మవరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి అధికారి కేవలం తన శాఖకే పరిమితం కాకుండా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా ఎలాంటి అంతరాయం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముదిగుబ్బ మండల పరిధిలోని మొలకవేముల విద్యుత్ ఉపకేంద్రం పనులను వేగవంతం చేయాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ, విద్యుత్, పోలీస్ శాఖలు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అలాగే ధర్మవరం పట్టణ విద్యుత్ మౌలిక సదుపాయాల బలోపేతంతో పాటు తాడిమర్రి మండలం పిన్నదరిలో ప్రతిపాదిత 33/11 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటుపై వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా రైతులకు సాగునీటి కొరత తలెత్తకుండా పీఏబీఆర్ కాలువ ద్వారా సమృద్ధిగా నీటి విడుదలకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువను పీఏబీఆర్ కుడి కాలువతో అనుసంధానం చేసి తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరం మండలాల్లో ఉద్యాన పంటలకు సాగునీరు మరియు తాగునీటి భద్రత కల్పించే అంశంపై అధికారులతో సవివరంగా చర్చించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన ప్రణాళికతో నీటి సరఫరాను నిరంతరంగా కొనసాగించాలని, ప్రజలకు కనీస అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు సూచించారు. ఆరోగ్య రంగానికి సంబంధించి ధర్మవరంలో నిర్మాణం పూర్తయిన ఎమ్ సీ హెచ్ బ్లాక్‌కు అవసరమైన సిబ్బంది నియామక ప్రక్రియ వేగవంతం చేయాలని, అసంపూర్తిగా ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఆయుర్వేద కళాశాల ఏర్పాటుకు సంబంధించిన అంశాలను కూడా సమీక్షించారు. అభివృద్ధి పనుల్లో భూసేకరణ, పరిహారం వంటి అంశాల వల్ల ఎక్కడైనా ఆలస్యం జరుగుతున్నట్లయితే సంబంధిత అధికారులు వెంటనే పరిష్కార మార్గాలు కనుగొని పనులు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా కదిరి గేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్, గ్రామీణ రహదారులు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పెండింగ్‌లో ఉండకూడదని, ప్రతి అధికారి ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పని చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు వేగవంతం చేసి ధర్మవరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జాయింట్ కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లాస్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.






# ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**కదిరి, జూన్ 8 పభాతవార్త**

భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం పై ప్రజల్లో, పార్టీ నాయకుల్లో అవగాహన పెంపొందించేందుకు సోమవారం స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటర్ల జాబితాలో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలు, తప్పుల సవరణ, చిరునామా మార్పులు వంటి అంశాలపై నాయకులకు వివరణ ఇచ్చారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, ఓటర్ల జాబితాలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని నాయకులకు సూచించారు.ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర నాయకులు పవన్ కుమార్ రెడ్డి, స్వచ్ఛ ఆంధ్ర మిషన్ రాష్ట్ర డైరెక్టర్ పర్వీన్ భాను, టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, అనిల్ కుమార్ రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని, తెలుగుదేశం పార్టీ, బూత్ కన్వీనర్, యూనిట్, కో యూనిట్, క్లస్టర్, కో క్లస్టర్లు, వార్డు,గ్రామ పంచాయతీ ప్రెసిడెంట్,సెక్రటరీలు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశం హాజరైన టిడిపి నాయకులు, బూత్ కన్వీనర్లు,

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి





.సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, హాజరైన క్లస్టర్ ఇంచార్జిలు

**పుట్టపర్తి టౌన్, జూన్ 8, ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను విజయవంతంగా అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నామని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (శీ.ఆి) కార్యక్రమంపై పుట్టపర్తి నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జిలు, కోక్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, కోయూనిట్ ఇంచార్జిలు, టీడీపీ ముఖ్య నాయకులతో నిర్వహించిన వర్క్‌షాప్ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని పార్టీ నాయకులకు సూచించారు. ప్రతి ఒక్క ఓటు కీలకమని, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. ముఖ్యంగా టీడీపీ మద్దతుదారుల ఓట్లు తొలగించబడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం సుపరిపాలన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో మరోసారి కూటమిని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలో ఉంటేనే ఆంధ్రప్రదేశ్‌లో ఊహించని స్థాయిలో అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో రూ.1.51 లక్షల కోట్ల పెట్టుబడులతో భారీ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కూటమి పాలనలో కేవలం రెండేళ్ల వ్యవధిలోనే నియోజకవర్గం కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమానికి ముందు ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ మండల టీడీపీ కన్వీనర్లు ,క్లస్టర్ ఇంచార్జులు , యూనిట్ ఇంచార్జులు ,కో క్లస్టర్ ఇంచార్జు కూటమిపార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్ మరియు యూనిట్ ఇంచార్జిలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హామీలు గాలికి.. ప్రజలకు నిరాశ..

# ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు : శైలజానాథ్

- 12న వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన ర్యాలీ..




కల్లూరు బైపాస్‌లో నిర్వహించిన వైఎస్సార్సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డా. సాకే శైలజానాథ్. వేదికపై జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ నాయకులు.

**గార్లదిన్నె ,జూన్ 08, ప్రభాతవార్త**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి డా. సాకే శైలజానాథ్ విమర్శించారు. మండలంలోని కల్లూరు బైపాస్ సమీపంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన వైఎస్సార్సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమలైన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఎన్నికల హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజల సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదయ్యేలా చూడాలన్నారు.డా. సాకే శైలజానాథ్ మాట్లాడుతూ.. డీఎస్సీ సహా అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు. ప్రజలు ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పకుండా కేసులు నమోదు చేస్తూ కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. వైఎస్సార్సీపీ కార్యకర్తలు కేసులకు భయపడరని, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తారని స్పష్టం చేశారు.12న భారీ ర్యాలీ'వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12న నియోజకవర్గ కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎల్.ఎం. మోహన్‌రెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, నారాయణరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# నాణ్యతగా పిజిఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలి





ప్రజలతో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, వినికిడి మిషన్లు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్

**అనంతపురము కలెక్టరేట్ జూన్ 08 ప్రభాతవార్త**

అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించగా, ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, ఆనంద్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 643 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించడం జరిగింది. ఇందులో అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించాలని అధికారులకు అక్కడికక్కడే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సమస్యల పరిష్కార వేదిక అనంతరం శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం ఆకుతోటపల్లి గ్రామస్తులు సిరివెళ్ల గంగులమ్మ, కృష్ణమ్మ కు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ వినికిడి మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో వస్తున్న అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. ఎలాంటి పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించడం చేయాలన్నారు. గడువులోపు అర్జీలను పరిష్కరించడంపై ఆయా శాఖల జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పెండింగ్ ఉన్న అర్జీలను కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రజా సానుకూల స్పందన పెంపొందేలా మరింత మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ సుబ్బరాయుడు, సిపిఓ అశోక్ కుమార్, డిఎండబ్ల్యుఓ రామసుబ్బారెడ్డి, జడ్పి సిఈఓ విజయలక్ష్మి, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూకొఠారి, హౌసింగ్ పిడి శైలజ, బిసి కార్పొరేషన్ ఈడి సుబ్రమణ్యం, డిఎంహెచ్ఓ ఈబి.దేవి, డిసిఓ అరుణకుమారి, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, సెక్షన్ సూపరింటెండెంట్లు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటు కీలకమే.. ఎవరూ నిర్లక్ష్యం చేయకండి

ఎస్ఐఆర్ పై ఎమ్మెల్యే సునీత నాయకులకు సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**కనగానపల్లి జూన్ 8 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సందర్శించారు. పాఠశాలలో 1.25 కోట్ల ఎస్.ఎస్.ఏ నిధులతో నిర్మిస్తున్న అదనపు తరగతి భవనాలను పరిశీలించారు. పాఠశాలలు 12వ తేది నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు. అనంతరం కస్తూరిబా బాలికల పాఠశాల నుంచి స్కూటీ పై ప్రయాణించి స్థానిక చెరువు మరమ్మత్తు పనులను పరిశీలించారు. వర్షాలు వస్తున్న నేపథ్యంలో పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.అనంతరం ఎస్ఐఆర్ పై ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ స్థానిక మండల నాయకులకు ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం గురించి పార్టీ శ్రేణులకు వివరించారు. బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొనే పరిస్థితులు, ఓటరు ధృవీకరణ విధానం, కుటుంబ లింకేజీలు, డ్రాఫ్ట్ జాబితా పరిశీలన, అభ్యంతరాల ప్రక్రియ తదితర అంశాలపై సుదీర్ఘంగా అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమం ఈనెల 15వ తేది నుంచి ప్రారంభమవుతుందని.. క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ 25 ఏళ్లకోసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ జరుగుతుందని.. 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియను చేస్తున్నారని తెలిపారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారని వివరించడం జరిగింది. జులై 15 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు ఇంటింటి ప్రచారం చేయాలని వారికి ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ యాతం పోతులయ్య,కో కన్వీనర్లు ,యూనిట్ ఇన్చార్జులు, బూత్ కన్వీనర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# కమాండ్ కంట్రోల్ రూంకు నాలుగు ఫిర్యాదులు

**అనంతపురం, జూన్ 8, ప్రభాతవార్త**



జశ్వంతరావ్

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐ.సిసిసి) టోల్ ఫ్రీ నెం 1800 599 2401 ద్వారా సోమవారం 4 ఫిర్యాదులు వచ్చాయి. లావణ్య, 13-619, రామచంద్ర నగర్, చెత్త సమస్య, బాల, 12-928, రాణినగర్ డ్రైనేజి క్లీనింగ్, సుధాకర్, 28-6-502, వీధి దీపాలు, చంద్రశేఖర్, 17/992, వేణుగోపాల్‌నగర్, వీధి దీపాలు ఫిర్యాదులు వచ్చాయని వీటిని 24 గంటలలోపల పరిష్కారం చేయబడతాయని నగరపాలకసంస్థ కమిషనర్ జశ్వంతరావ్ తెలిపారు.

# ఎమ్మెల్యే బాలకృష్ణ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**శింగనమల, జూన్ 8 ప్రభాతవార్త**

మెల్ బోర్న్‌లో నిర్వహించిన నందమూరి తారక రామారావు జయంతి, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 66వ పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్సీ కావలి గ్రీష్మతో కలిసి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖండాంతరాలు దాటినా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్ సారధ్యంలో ముందుకు సాగుతున్న తెలుగుదేశం పార్టీపై కార్యకర్తలు, అభిమానులు చూపుతున్న ప్రేమ, ఆధరణ ఎప్పటికీ మరిచి పోలేనివని తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

02ATP27.qxd:02ATP27.qxd 09/06/26 10:18 PM Page 1



# నవ చేతన యాప్ పై శిక్షణ



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

హిందూపురం జూన్ 8 ప్రభాతవార్త

నవచేతన యాప్ పై అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం సోమవారం ఏర్పాటు చేశారు. అంగన్వాడీలో చదివే చిన్నారుల అభివృద్ధి మైలు రాళ్ల గుర్తింపునకు నవ చేతన యాప్ ద్వారా 06 సంవత్సరాలలోపు చిన్నారులకు తగిన సేవలను అందించేందుకు కృత్రిమ మేధా (ఏఐ) ఆధారిత "నవచేతన" యాప్ ఎంతో ఉపయోగపడుతుందని ఐసిడిఎస్ సిడిపిఓ సుధా వరలక్ష్మి తెలిపారు. దుర్గా బాయి దేశ్ముఖ్ ప్రాథమిక పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య స్థితి, ఎదుగుదల, మానసిక వికాసం వంటి అంశాలను ఖచ్చితముగా అంచనా వేసేందుకు నవచేతన యాప్ రూపొందించబడిందన్నారు . పిల్లల్లో జరిగే ఐదు రకాల అభివృద్ధి దశలకు సంబంధించిన స్క్రీనింగ్ ద్వారా వైద్య, పోషకాహార ప్రోత్సాహక సేవలను అందించవచ్చని వివరించారు. సరైన స్టిమ్యు లేషన్ అందించినప్పుడే చిన్నారుల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు, శిక్షణా కార్యక్రమంలో భాగంగా డాక్టర్ హిమ బిందు , సూపర్వైజర్లు శాంతి, సరస్వతి, అనిత నవ చేతన యాప్ వినియోగ విధానం, పిల్లల స్క్రీనింగ్ ప్రక్రియ, అభివృద్ధి దశలో గుర్తింపు తదితర అంశాలపై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు.

# APAIMS ద్వారానే ఎరువుల పంపిణీ

బెలుగుప్ప, జూన్ 8 ప్రభాతవార్త

రసాయన ఎరువుల కోసం రైతులు పడే ఇబ్బందులను తొలగించేందుకు ఈ ఖరీఫ్ నుండి వ్యవసాయ శాఖ ఎరువుల కొరకు ప్రత్యేక "ఫర్టిలైజర్ యాప్ "ను తీసుకురావడం జరిగిందని వ్యవసాయ అధికారి పృథ్వి సాగర్ తెలిపారు. ఈ యాప్ ద్వారా పంటలకు అనుగుణంగా కావలసిన ఎరువుల క్రయవిక్రయాలు జరుగుతాయని తెలిపారు. యూరియా మరియు డిఏపీ కావాల్సిన రైతులు మీ గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల నందు మీ వివరంగానూ సరిచూసుకొని ఏ ఎరువులు దుకాణంలోనైనా యూరియా మరియు డిఏపీని పొందవచ్చునని, ఈ యాప్ పై ఎలాంటి అపోహలు ఉంచవద్దని తెలిపారు. ఈ యాప్ ద్వారా ఏ పంట కైనా ఎంత మోతాదులో కావాల్సిన యూరియా మరియు డిఏపీని రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ యాప్ ద్వారా మండలంలో ఉన్న ఏ ఎరువుల దుకాణంలోనైనా మరియు పిఎసిఎస్ లోనైనా యూరియా మరియు డిఏపీని పొందవచ్చునని తెలిపారు.

# పెన్షనర్లకు బ్యాంకులు మరిన్ని ఆర్థిక సౌకర్యాలు కల్పించాలి

## ఎస్బిఐ మేనేజర్తో విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధుల భేటీ

కళ్యాణదుర్గం, జూన్ 8 ప్రభాతవార్త


పెన్షనర్లకు అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలపై చర్చించిన విశ్రాంత ఉద్యోగుల సంఘం

పెన్షనర్లకు బ్యాంకింగ్ సేవలను మరింత సులభతరం చేసి, వారికి అందుబాటులో ఉన్న ప్రత్యేక సౌకర్యాలను విస్తృతంగా అందించాలనే ఉద్దేశంతో కళ్యాణదుర్గం విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సోమవారం కళ్యాణదుర్గం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ప్రధాన శాఖ మేనేజర్ సంపత్ కుమార్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల కోసం ఎస్బీఐ అమలు చేస్తున్న కాంప్రహెన్సివ్ పెన్షన్ ప్యాకేజ్ (సీపీపీ) పథకం గురించి విస్తృతంగా చర్చించారు. ప్రస్తుతం బ్యాంకు ద్వారా పెన్షన్లు పొందుతున్న అర్హులైన పెన్షనర్లందరినీ ఈ పథకం కింద నమోదు చేయాలని సంఘం ప్రతినిధులు కోరారు. ఈ పథకం ద్వారా పెన్షనర్లకు కనీస నిల్వ నిబంధన లేకపోవడం, ఎస్ఎంఎస్ ఛార్జీల మినహాయింపు, ఏటీఎం కార్డు జారీ రుసుము మాఫీ, వ్యక్తిగత ప్రమాద బీమా కవరేజీతో పాటు అర్హతను బట్టి రూ.30 లక్షల వరకు బీమా ప్రయోజనా లు లభించే అవకాశం ఉందని వారు వివరించారు. ఈ సౌకర్యాలు ప్రతి పెన్షనర్కు చేరేలా బ్యాంకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై స్పందించిన చీఫ్ మేనేజర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ, పెన్షనర్ల జాబితా మరియు వారి ఖాతా వివరాలను అందజేస్తే అర్హులైన వారందరినీ సీపీపీ పథకం కింద నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బ్యాంకు నిబంధనల ప్రకారం పెన్షనర్లకు మెరుగైన సేవలు అందించేందుకు ఎప్పటికప్పుడు కృషి చేస్తామని తెలిపారు. పెన్షనర్ల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై బ్యాంకు అధికారులు సానుకూలంగా స్పందించడం పట్ల విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ చర్యల ద్వారా ప్రాంతంలోని పెన్షనర్లకు మరింత భద్రత, ఆర్థిక ప్రయోజనాలు అందనున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మల్లికార్జున, కార్యదర్శి తిప్పే స్వామి, పూర్వాధ్యక్షులు శివప్రసాద్, భగవాన్ దాస్, విజయ్ కుమార్, అంపన్న, ఇస్మాయిల్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# పేదరికాన్ని జయించి ప్రతిభతో శిఖరాగ్రానికి చేరిన అర్చన

## ఇంటర్మీడియట్లో 968 మార్కులు సాధించి అంబేద్కర్ ప్రతిభ అవార్డు అందుకున్న విద్యార్థిని

కళ్యాణదుర్గం, జూన్ 8 ప్రభాతవార్త:


అంబేద్కర్ ప్రతిభ అవార్డు అందుకుంటున్న అర్చన

కష్టాలను మెట్టులుగా మార్చుకుని, పేదరికాన్ని అధిగమించి ప్రతిభతో వెలుగొందిన దళిత విద్యార్థిని అర్చన మరోసారి తన ప్రతిభను చాటుకుంది. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన అర్చన ఇంటర్మీడియట్ పరీక్షల్లో 968 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచింది. తండ్రి గురుమూర్తి, తల్లి శివమ్మల కుమార్తె అయిన అర్చన సాధారణ కుటుంబంలో జన్మించినప్పటికీ అసాధారణమైన కృషి, పట్టుదలతో విద్యారంగంలో ఉన్నత ఫలితాలు సాధించింది. శ్రీ సత్యసాయి జిల్లా అమలాపురం మండలంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించిన ఆమె, ఉత్తమ మార్కులతో తన కుటుంబానికి, గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఇంటర్మీడియట్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అంబేద్కర్ భవన్లో నిర్వహించిన అంబేద్కర్ ప్రతిభ అవార్డుల మహోత్సవంలో అర్చనకు ప్రతిష్ఠాత్మక అంబేద్కర్ ప్రతిభ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, సామాజిక నాయకులు ఆమెను అభినందించారు. అవార్డు స్వీకరించిన అనంతరం అర్చన మాట్లాడుతూ, "అధ్యాపకుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల నిరంతర ప్రోత్సాహమే ఈ విజయానికి కారణం. భవిష్యత్తులో మరింత ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేయాలనేది నా లక్ష్యం" అని తెలిపింది. అర్చన సాధించిన విజయాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు కుందుర్పి లక్ష్మణమూర్తి దంపతులు ప్రత్యేకంగా అభినందిస్తూ, ఆమె మరెంతో మంది విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పేదరికం ప్రతిభకు అడ్డుకాదని అర్చన మరోసారి నిరూపించిందని కొనియాడారు.

# లక్షా ఇరవై వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

కనేకల్లు జూలై 08 ప్రభాత వార్త


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కాలువ

కనేకల్లు మండల పరిధిలోని మాల్యం గ్రామానికి చెంది నదేవరింటి మాల నారాయణకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు కింద లక్ష ఇరవై వేల రూపాయలు ముఖ్య మంత్రి సహాయనిదినుండి ప్రభుత్వ విప్పు రాయదుర్గం శాసనసభ్యులు కాలువ శ్రీనివాసులు చేతులు మీదుగా మరియు మల్యాం టీడీపీ సీనియర్ నాయకులు శరబనాగౌడ్. ప్రభాకర్. చంద్ర శేఖర్ గౌడ్. మహేష్ గౌడ్. బసవరాజు చేతులు మీదుగా చెక్కును పంపిణీ చేశారు. తనకు సీఎం రిలీఫ్ ఫండ్ కు సహకరించిన రాయదుర్గం శాసనసభ్యులు కాలువ శ్రీనివాసులు కి మల్యాం టీడీపీ నాయకులకు ధన్యవాదములు తెలియజేశారు కాస్త కాలంలో తమ నాయకులు మాకు అండగా నిలబడినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# కార్మికుల సమస్యలను మంత్రికి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా

## సిఐటియు నాయకులకు ఎమ్మెల్యే కాలవ హామీ

రాయదుర్గం జూన్ 8 ప్రభాతవార్త

మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కార్మికులకు హామీ ఇచ్చారు. కార్మిక సమస్యలపై సోమవారం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులుగా దశాబ్దాలుగా సేవలందిస్తున్న తమకు ప్రభుత్వపరంగా ఎటువంటి సంక్షేమ పథకాలు అందడం లేదని ఆందోళన వ్యక్తపరిచారు. కనీసం పక్కా ఇంటికి కూడా నోచుకోలేక పోతున్నామని ఆవేదన చెందారు. చాలీచాలని వేతనంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలియజేశారు. పీఆర్సి ద్వారా కనీసం వేతనం పెరుగుతుందని ఎదురు చూస్తుంటే దాన్ని కూడా నాలుగేళ్లుగా అమలు చేయడం లేదని తెలిపారు. మరీ ముఖ్యంగా మున్సిపాలిటీలో చెత్త తరలింపుకు ప్రైవేట్ వెహికల్స్ అద్దెకు తీసుకుంటుండటం వల్ల కార్మికుల ఉపాధి దెబ్బతింటుందని వివరించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ప్రైవేటీకరణ ఆపాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, పక్కా ఇల్లు మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యే కాలవ సానుకూలంగా స్పందిస్తూ... కొన్ని అంశాలపై ఇదివరకే ప్రభుత్వ స్థాయిలో చర్చలు జరిగాయన్నారు. కార్మికులు ప్రభుత్వం నుండి వేతనం చేసుకుంటుండటం వల్ల సంక్షేమ పథకాలు వర్తించడం లేదన్నారు. వీటిపై పురపాలక శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

# "నవచేతన"పై అంగన్వాడి కార్యకర్తలకు అవగాహన

## -సూపర్వైజర్లు మంజుల, రాధ ఆధ్వర్యంలో కార్యక్రమాలు


అవగాహన కల్పిస్తున్న సూపర్వైజర్లు

గోరంట్ల, జూన్ 8 ప్రభాతవార్త

గోరంట్ల మండలంలోని పాలసముద్రం, బూదిలి సెక్టార్ పరిధిలో సిడిపిఒ డాక్టర్ శాంతలక్ష్మి ఆదేశాల మేరకు సూపర్వైజర్లు రాధ, మంజుల ఆధ్వర్యంలో 3వ బ్యాచ్ అంగన్వాడి టీచర్లకు "నవచేతన" బాల్యారంభ అభివృద్ధి స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ప్రతి చిన్నారికి జీవితంలో అత్యుత్తమ ఆరంభాన్ని అందించడమే లక్ష్యంగా తొలి వెయ్యి రోజులు చిన్నారి భవిష్యత్తును నిర్ణయించే అవకాశం గర్భధారణ నుండి రెండేళ్ల వయసు వరకు ఉండే తొలి వెయ్యి రోజులు చిన్నారి జీవితంలో అత్యంత కీలకమైనవని సూపర్వైజర్లు పేర్కొన్నారు. ఈ సమయంలో పిల్లల మెదడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని పిల్లల మెదడు అభివృద్ధిలో 80 శాతం మూడు సంవత్సరాల వయసులోపు 90 శాతం ఆరు సంవత్సరాల వయసులో పూర్తవుతుందని వివరించారు. ప్రారంభ సమయాల్లో అందే పోషకాహారం ఆరోగ్య సంరక్షణ ప్రారంభ అభ్యసన అవకాశాలు భద్రతా, ప్రేరణ పిల్లల భవిష్యత్తు విద్య, ఆరోగ్యం, శ్రేయస్సుపై గణనీయమైన ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. బాలల అభివృద్ధిలో ఆలస్యాలను ముందుగానే గుర్తించి సకాలంలో సేవలు అందించేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయంగా నవచేతన అనే మొబైల్ ఆధారిత అభివృద్ధి స్క్రీనింగ్ చేసే కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడం కోసం సున్నా నుండి 6 సంవత్సరాల వయసు గల పిల్లల అభివృద్ధిని అంచనా వేయడానికి ఉపయోగపడుతుందన్నారు. నవచేతన వేదిక ద్వారా అంగన్వాడి కార్యకర్తలు పిల్లల్లో స్థూల చలన నైపుణ్యాలు సూక్ష్మచలన నైపుణ్యాలు భాషాభివృద్ధి జ్ఞాన వికాసం మరియు సామాజిక భావోద్వేగ అభివృద్ధి అంటే ఐదు ప్రధాన అభివృద్ధి రంగాలను పరిశీలించగలరని తెలిపారు. దీని ద్వారా అదనపు మద్దతు లేదా ముందస్తు సేవలు అవసరమయ్యే పిల్లలను త్వరగా గుర్తించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలు అయ్యేలా అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఒ డాక్టర్ శాంతలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ శృతి, సూపర్వైజర్లు రాధ, మంజుల, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిడుగు పాటు కు పాడి ఆవు మృతి

బ్రహ్మసముద్రం జూన్ 8 ప్రభాతవార్త


మృతి చెందిన ఆవు

బ్రహ్మసముద్రం మండలం భైరవానితిప్ప గ్రామ పంచాయతీ పోలేపల్లి లో పాడిరైతు మహాదేవమ్మ కు చెందిన ఆవు సోమవారం సాయంత్రం పిడుగు పడి పాడి ఆవు మృతి చెందింది. జీవనాధారమైన పాడావు మృతి చెందడం పై పాడి రైతు మాహాదేవమ్మ బోరున విలపించింది. దాదాపు 50 వేల వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఉత్తీర్ణత విద్యార్థులు ఆర్డిటి కార్యాలయంలో సంప్రదించండి

రొళ్ల జూన్7 ప్రభాతవార్త

శ్రీసత్యసాయి జిల్లాలో 202627 విద్యా సంవత్సరం కు సంబంధించి ఎస్సీ,ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆర్డిటి సంస్థ అధికారులు పేర్కొన్నారు.పదవ తరగతిలో ఉత్తీర్ణత కనబరిచిన విద్యార్థులకు స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ద్వారా పదవ తరగతిలో 500 మార్కుల నుంచి 519 మార్కులు సాధించిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సెమీ స్కాలర్షిప్ ప్రోగ్రామ్ ద్వారా మరో అవకాశం కల్పిస్తున్నట్లు ఆర్డిటి ఏరియా టీం లీడర్ ఓబులేష్ తెలిపారు. పూర్తి సమాచారం కొరకు విద్యార్థులు ఆర్టిటి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

# భూ వివాదంలో ఘర్షణ

## -వ్యక్తి హత్య - మరో వ్యక్తికి గాయాలు

చిలమత్తూరు, జూన్ 8 ప్రభాతవార్త


హత్యకు గురైన రామకృష్ణ


రామకృష్ణ (ఫైల్ఫోటో)


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిలమత్తూరు మండలంలో ఘోరం జరిగింది. భూ వివాదంలో జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి చనిపోగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపినవివరాల మేరకు మండల పరిధిలోని మొరసనపల్లి పంచాయతీ భూమయ్యగారిపల్లి గ్రామానికి చెందిన చాకలి రామచంద్రకు, ఎస్.ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శివప్పకు కొంత కాలం నుంచి భూ వివాదం నడుస్తోంది. భూ రీసర్వే కార్యక్రమంలో భాగంగా భూమికి సంబంధించిన విషయంలో సోమవారం ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఎస్.ముదిరెడ్డిపల్లికి చెందిన చాకలి శివప్ప కొడవలితో చాకలి రామచంద్ర, చాకలి రామకృష్ణపై దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ దాడిలో రామకృష్ణ తలకు బలంగా తగిలింది. వెంటనే గ్రామస్తులు, బంధువులు 108లో అసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే రామకృష్ణ (48) మృతి చెందాడు. దాడిలో గాయపడిన రామచంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై మృతుని భార్య రాధ పోలీసులకు ఫిర్యాదు చేసింది. హిందూపురం అడిషనల్ ఎస్పి మహేష్, హిందూపురం రూరల్ సిఐ జనార్దన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మరిన్ని వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికానున్నాయి.

# ఐఈఆర్పీలకు ఎయిడ్స్,ఆప్లియెన్సెస్ పరికరాలు పంపిణీ

## ఈ పరికరాలు దివ్యాంగుల పిల్లలు వినియోగించేలా చర్యలు


పరికరాలను ఐఈఆర్పిలకు పంపిణీ చేస్తున్న ఏపీసి దృశ్యం

కొత్తచెరువు జూన్ 8 ప్రభాతవార్త

జిల్లాస్థాయిలో దివ్యాంగులైన పిల్లలకోసం ఐఈఆర్పిలకు ఎయిడ్స్ ,అప్లియన్సిస్ పరికరాలను సమగ్ర శిక్ష ఏపీసి ఎ వెంకటేశులు పంపిణీ చేశారు సోమవారం బుక్కపట్నం డైట్ కాలేజ్ నందు ఐఈఆర్ పిలుకి ఎయిడ్స్ మరియు ఆప్లియెన్సెస్ పరికరాలలో దివ్యాంగుల కి సద్వినియోగం చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. జిల్లాలోని 60 మంది ఐఈఆర్పీలు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటేష్ విచ్చేశారు ఈ సందర్భంగా 508 మంది దివ్యాంగు లైన పిల్లలకు ప్రభుత్వం సరఫరా చేసినటువంటి 545 ఎయిడ్స్ ,అప్లియన్సిస్ ను ఐఈఆర్పిలకు పంపిణీ చేశారు. ప్రభుత్వము పంపిణీ చేసినటువంటి సహాయ పరికరాలను దివ్యాంగులైన పిల్లలకు అందజేశారు ఈ పరికరాలను సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని ఇందుకోసం నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలను నిర్వహించి దివ్యాంగులైన పిల్లలకు పంపిణీ చేయాలని ఐఆర్పీలకు సూచించారు. అలింకో రెప్రెజెంటేటివ్ సోనీ మాట్లాడుతూ ఎయిడ్స్ ,అప్లియన్సిస్ పొందడానికి దివ్యాంగులైన పిల్లలు సదరం సర్టిఫికెట్తోపాటు యూడిఐడి కార్డు కలిగి ఉండాలని మరియు వివిధ రకాలైనటువంటి దివ్యాంగులైన పిల్లలు ఏ విధంగా ఎయిడ్స్ ,అప్లియన్సిస్ ఉపయోగించుకోవాలో తెలియజేశారు. జిల్లాసహిత విద్యా సమన్వయకర్త ఎస్పీ పుల్లన్న మాట్లాడుతూ ఐఈఆర్పి లందరూ ప్రతిరోజు దివ్యాంగులైన పిల్లలు ప్రభుత్వం ఇచ్చినటువంటి ఎయిడ్స్ ,అప్లియన్సిస్ వినియోగించుకునే విధంగా తల్లిదండ్రులకు సూచనలు ఇచ్చి పిల్లలను ప్రోత్సహించాలని తెలియజేశారు.

# కర్ణాటక మాజీమంత్రి వెంకటరమణప్ప వైకుంఠ సమారాధన

## నివాళులర్పించిన ఎంపీ తనయుడు బి.కే సాయి కళ్యాణ్

## నివాళులర్పించిన ధర్మవరం టిడిపి ఇంచార్జ్ పరిటాల శ్రీరాములు

పెనుకొండ జూన్ 8 ప్రభాతవార్త


వెంకటరమణప్ప చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బి. కే సాయికళ్యాణ్

కర్ణాటక మాజీమంత్రి పావగడ మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్ప వైకుంఠ సమారాధన వెంకటరమణప్ప తనయులు పావగడ ఎమ్మెల్యే వెంకటేష్ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిందూపురం ఎంపీ బీ.కే పార్థసారథి తనయుడు బి.కే సాయికళ్యాణ్, ఎంపీ బి.కె అల్లుడు శశిభూషణ్ పటేల్ లు హాజరై వెంకటరమణప్ప చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ధర్మవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ , హిందూపురం పార్లమెంట్ టిడిపి మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ తదితరులు నివాళులర్పించారు.

# పని ఒత్తిడితోనే...ప్రాణాలు పోతున్నాయి

## - గోరంట్ల తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపిన రెవిన్యూ సిబ్బంది

గోరంట్ల, జూన్ 8 ప్రభాతవార్త


నిరసన తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

కర్నూల్ జిల్లాకు చెందిన వార్డు రెవెన్యూ కార్యదర్శి షేక్ మహమ్మద్ హుస్సేన్ అధిక పని ఒత్తిడి వలన ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటనకు నిరసనగా గోరంట్ల మండల గ్రామ రెవెన్యూ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు నాగరాజరావు నేతృతంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నల్ల రిబ్బన్లు ధరించి శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు నాగరాజరావు మాట్లాడుతూ వార్డు రెవెన్యూ కార్యదర్శి మరణానికి కారణమైన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలనీ ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో గోరంట్ల మండల గ్రామ రెవెన్యూ అధికారుల అధ్యక్షులు కె.నాగరాజరావు, విఆర్ఓలు పి.అశోక్కుమార్, మన్సూర్, రమేష్, నాగప్ప, వార్డుల గ్రామ సర్వేయర్లు బి.రాజా, గాయత్రి, సంధ్య, శీనానాయక్, విఆర్ఏలు టి.శివప్ప, టి.శ్రీనివాసులు, నరసింహులు, నరసింహప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ఏవీఆర్ పాఠశాలలో పాఠ్య పుస్తకాల గది సీజ్..!

## - నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తుండగా గుర్తించిన విద్యార్థి సంఘాలు - పాఠశాలకు చేరుకొని పుస్తకాల గదిని సీజ్ చేసిన మండల విద్యాధికారి

ఉరవకొండ, జూన్ 8 ప్రభాతవార్త



ఏవీఆర్ పాఠశాలలో పుస్తకాల గదిను సీజ్ చేస్తున్న ఎంఈవో హెచ్.ఈశ్వరప్ప

ఉరవకొండ పట్టణంలోని ఏవీఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలను విక్రయిస్తుండటంతో విద్యార్థి సంఘాల పిర్యాదు మేరకు మండల విద్యాధికారి హెచ్.ఈశ్వరప్ప పుస్తకాలు నిల్వ చేసిన గదిని సీజ్ చేశారు. పీఎస్ఎఫ్ఐ, ఎంఆర్సీఎస్, ఎంఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం ఉదయం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తుండగా గుర్తించి మండల విద్యాధికారికు సమాచారం అందించారు. ఈ క్రమంలోనే ఆయన పాఠశాలకు చేరుకొని విద్యార్థి సంఘాల నాయకుల సమక్షంలో పుస్తకాలు నిల్వ ఉంచిన గదిని సీజ్చేసి అమ్మకాలు జరుపరాదని అక్కడి సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థిసంఘాలనాయకులు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం నిబంధనలను అతిక్రమించి విద్యార్థుల తల్లిదండ్రులతో వేలాది రూపాయలు వసూళుచేసుకొని పుస్తకాలు, ఇతరత్రావస్తువులను అంటగడుతోందని పాఠశాలపై చర్యలుతీసుకోవాలని డిమాండ్చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.హిరణ్య, ఎంఆర్సీఎస్ జిల్లా అధ్యక్షులు బండారి పృధ్వీరాజ్, ఎంఎస్ఎఫ్ జిలాల కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.

# కోతులను ఆలయ పరిసరాల్లో వదిలితే చట్టపరంగా చర్యలు

## - లక్ష్మినరసింహస్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్బాబు

ఉరవకొండ, జూన్ 8 ప్రభాతవార్త


విలేఖరులతో మాట్లాడుతున్న ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్బాబు

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయ పరిసరాల్లో ఎవరైనా, ఎక్కడి నుంచైనా కోతులను తీసుకొచ్చి వదిలితే అలాంటి వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్బాబు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. పెన్నహోబిళం పరిసర ప్రాంతాల్లో కోతుల సంఖ్య అధికంగా పెరిగి భక్తులకు, స్థానిక ప్రజలకు, ఆలయ పరిసరాల్లోని దుకాణదారులకు, హోటళ్ల నిర్వాహకులు,తినుబండాల వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈక్రమంలో కొందరు వ్యక్తులు ఇతర ప్రాంతాల నుండి కోతులను తీసుకొచ్చి ఆలయ పరిసర ప్రాంతాల్లో వదులుతున్నారన్నారు. దీంతో కోతులసంఖ్య భారీగా పెరిగిపోయి కోతులబెడదతో భక్తులకు భద్రత కరువై, ప్రశాంత వాతావరణానికి విఘాతం కలుగుతోందన్నారు. కనుక ఇతర ప్రాంతాల నుండి ఎవరైనా కోతులను తీసుకొచ్చి ఆలయ పరిసరాల్లో వదిలితే చర్యలు తప్పవన్నారు. ఎవరైనా కోతులను విడిచిపెట్టాలనుకుంటే అటవీశాఖ నిబంధనల మేరకు అటవీ ప్రాంతాల్లో మాత్రమే విడిచిపెట్టాలని ఈవో సాకే రమేష్బాబు సూచించారు.

# విద్యార్థులకు సైకిల్ ఇస్తామని హామీ ఇచ్చిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

## మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలియజేసిన పెద్ద గువ్వల పల్లి గ్రామస్తులు, విద్యార్థులు

రొద్దం, జూన్ 8 ప్రభాతవార్త


మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న విద్యార్థులు గ్రామస్తులు

మండల పరిధిలోని పెద్ద గువ్వల పల్లి గోనివేకలవల్లి రెడ్డిపల్లి గ్రామాలలో చదువుకుంటున్న విద్యార్థులకు త్వరలోనే సైకిళ్లను ఏర్పాటు చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలియజేసింది ఈ సందర్భంగా పెద్ద గువ్వల పల్లి గ్రామంలో స్కూలుకు వెళ్లాలంటే బస్సు ఆటో సౌకర్యం లేదని సైకిలు తెచ్చుకునేందుకు ఆర్థికంగా స్తోమత లేని విద్యార్థులకు మూడు గ్రామాలకు చెందిన విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామస్తులు మంత్రి సవితాను కలిసి విషయం తెలియజేయగా మంత్రి వెంటనే స్పందించి సి ఎస్ ఆర్ నిధుల ద్వారా అవసరమైన మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అందులో భాగంగానే చదువుకునే పిల్లలకు సైకిళ్ల పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామస్తులు మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలియజేసి హర్షం వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనిల్ ఆంజనేయులు భాష సూర్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వైకాపా నాయకులను పరామర్శించిన జిబి శివకుమార్


వైకాపా నాయకులను పరామర్శిస్తున్న దృశ్యం

గుడిబండ జూన్ 8 ప్రభాతవార్త

మండల మోపురగుండు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగరాజు,నింగప్ప లు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మడకశిర నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా నింగప్ప ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని,కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.అనంతరం నింగప్పకు ఐదు వేల ఆర్థిక సాయం అందజేశారు.వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులకు భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిప్పేస్వామి,కదురప్ప,విశ్వనాథ్, కేటీ మంజునాథ్,బంగారు లింగప్ప, ప్రభాకర్, కరిలింగప్ప,నరేష్ పాల్గొన్నారు.

03ATP08.qxd:03ATP08.qxd 09/06/26 10:19 PM Page 1



# నేడు జోజిలా టన్నెల్ మేఘా బ్రేక్ త్రూకు సర్వం సిద్ధం

- కేంద్రమంత్రి గడ్కరీ చేతుల మీదుగా బ్రేక్ త్రూ కార్యక్రమం
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో నిర్మితమవుతున్న టన్నెల్ ఇదే..
- అత్యంత పొడవైన సింగిల్‌ట్యూబ్ ద్విముఖ రహదారి సొరంగం జోజిలా రోడ్ టన్నెల్ ప్రాజెక్ట్..



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న శ్రీనగర్ లడక్





మధ్యలో జోజీల టన్నెల్, జోజిలా టన్నెల్ నిర్మాణ దృశ్యాలు

**అనంతపురం, జూన్ 8, (ప్రభాతవార్త బ్యూరో)**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హంద్రీ నీవా సుజల స్రవంతి ప్రధాన కాలువ నిర్మాణం తోపాటు దేశంలో వివిధ ప్రాంతాల్లో ఎన్నో ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తి చేసిన ప్రముఖ నిర్మాణ సంస్థ మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ( ఎం ఈ ఐ ఎల్) దేశ సరిహద్దుల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన జోజిలా టర్నల్ ను చేపట్టి విజయవంతంగా పూర్తి చేసింది. జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలో శ్రీనగర్‌లడక్ మధ్య ఉపయోగపడే కీలకమైన రవాణా వ్యవస్థకు ఉపయోగపడే జోజిలా టర్నల్ ప్రాజెక్టు ను కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గట్కరీ చేతుల మీదుగా ఈనెల తొమ్మిదో తేదీన మంగళవారం లాంఛనంగా ప్రారంభిస్తున్నారు.


జమ్మూ కాశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలను నిత్యం అనుసంధానించే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జోజిలా టన్నెల్ ప్రాజెక్ట్ మరో చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. మంచుతో రహదారి కొండలు కప్పుకొని పోయి ఏడాదిలో ఆరు నెలల పాటు రాకపోకలకు బంద్ అయ్యేది. మంచు కొండకు ఎంతో శ్రమించి రెండు వైపుల నుంచి అధునాతన యంత్రాలతో దారి తవ్వి జోజుల టన్నలు ప్రాజెక్టును ప్రముఖ నిర్మాణ సంస్థ మెగా నిర్మాణ సంస్థ (మెయిల్)పూర్తి చేసి బ్రేక్ త్రూ కు సిద్ధం చేసింది. బ్రేక్ త్రూ అంటే కొండకు ఇరువైపు నుంచి రంధ్రం చేసి తొలిసారిగా రహదారి సౌకర్యాన్ని ఏర్పాటు చేయటం . శ్రీనగర్ లడక్ మధ్య సోనా మార్గ్ ప్రాంతంలో నిర్మించిన జోజిలా టన్నెల్ 13.153 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో నిర్మితమవుతున్న అత్యంత పొడవైన సింగిల్‌ట్యూబ్ ద్విముఖ రహదారి సొరంగంగా గుర్తింపు పొందింది. నేషనల్ హైవేస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ లిమిటెడ్ తరఫున మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ చేపట్టిన ఈ టన్నెల్ తుది బ్రేక్‌త్రూ భారత మౌలిక సదుపాయాల చరిత్రలో ఒక విశిష్ట ఘట్టంగా నిలవనుంది. జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలో సోనమార్గ సమీపంలోని బాల్టాల్ పశ్చిమ పోర్టల్ నుంచి ద్రాస్‌కార్గిల్ ప్రాంతంలోని సోనామార్గ తూర్పు పోర్టల్ వరకు విస్తరించిన జోజిలా టన్నెల్ ప్రాజెక్టు, భారీ మంచు, హిమపాతాలు, తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగా సంవత్సరంలో సగం కాలం మూసి ఉంచే జోజిలా పాస్‌కు శాశ్వత పరిష్కారం చూపుతుంది. సముద్ర మట్టానికి సుమారు ..11,578.. అడుగుల ఎత్తులో నిర్మితమవుతున్న ఈ టన్నెల్, భారతదేశ పర్వత ప్రాంత మౌలిక సదుపాయాల అభివృద్ధిలో అత్యంత కీలకమైన మైలురాయిగా నిలుస్తుంది.

### అత్యాధునిక ఎన్ ఏ టి ఎం సాంకేతికతతో నిర్మాణం

జోజిలా టన్నెల్‌ను న్యూ ఆస్ట్రియన్ టన్నెలింగ్ మెథడ్ (ఎన్ ఏ టి ఎం) ఉపయోగించి ఎం ఈ ఐ ఎల్ నిర్మిస్తోంది. హిమాలయ ప్రాంతంలోని సున్నితమైన భౌగోళిక పరిస్థితులు, మారుతూ ఉండే రాతి నిర్మాణాలకు అనుగుణంగా ఈ పద్ధతి అత్యంత సమర్థవంతంగా పనిచేస్తుంది. దశలవారీ తవ్వకం, తక్షణ భద్రతా చర్యలు, షాట్‌క్రీట్, రాక్ బోల్టింగ్, నిరంతర భూభౌతిక పర్యవేక్షణ వంటి చర్యల ద్వారా సొరంగ నిర్మాణంలో స్థిరత్వం, భద్రత, వేగాన్ని మేఘా విజయవంతంగా కొనసాగించింది.

ప్రధాన టన్నెల్‌తో పాటు అనుసంధాన రహదారులు, వంతెనలు, రక్షణ నిర్మాణాలు, కట్‌అండ్‌కవర్ సెక్షన్లు, మంచు రక్షణ గ్యాలరీలు, నిల్‌గ్రార్ జంట సొరంగాలు కూడా ఈ ప్రాజెక్టులో భాగమే.ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత శ్రీనగర్ – లడఖ్ మధ్య 365 రోజులపాటు నిరంతర రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ద్రాస్, కార్గిల్, లేహ్ తదితర ప్రాంతా ప్రజలకు సరుకులు, అత్యవసర సేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయి. అలాగే వ్యూహాత్మకంగా కీలకమైన సరిహద్దు ప్రాంతాల్లో సైనిక రవాణా, లాజిస్టిక్స్ సామర్థ్యం మరింత బలోపేతం అవుతుంది. జోజిలా టన్నెల్ ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి, పర్యాటక రంగ ప్రోత్సాహం, వాణిజ్య కార్యకలాపాల విస్తరణకు దోహదపడటమే కాకుండా, దేశ భద్రత పరంగా కూడా అత్యంత కీలకమైన మౌలిక సదుపాయంగా జోజిలా టన్నెల్ నిలుస్తుంది.

పశ్చిమ హిమాలయాల్లోని అత్యంత క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు, హిమపాతాల ముప్పు, తీవ్రమైన శీతాకాలం వంటి ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగుతున్న జోజిలా టన్నెల్ తుది బ్రేక్‌త్రూ భారతదేశం అత్యంత క్లిష్టమైన పర్వత ప్రాంత రవాణా మౌలిక సదుపాయాల నిర్మాణంలో సాధించిన అసాధారణ విజయానికి నిదర్శనం . జోజిలా టన్నెల్ పూర్తి ఐన తరువాత కాశ్మీర్–లడఖ్ మధ్య అన్ని కాలాల్లో నిరంతర అనుసంధానం కల్పించడంతో పాటు, ప్రాంతీయ అభివృద్ధి, ఆర్థిక సమగ్రత, జాతీయ భద్రతా సామర్థ్యాలను మరింత బలోపేతం చేయనుంది.



నితిన్ గడ్కరి

### జోజిలా టన్నెల్లో కీలక ఘట్టాలు..

ఈ ప్రాజెక్ట్ నిర్మాణం 2020 అక్టోబర్ ఒకటిన ప్రారంభమైంది. తుది బ్రేక్ త్రూ మంగళవారం(జూన్9 న ) జరగనుంది. ప్రాజెక్ట్ లో భాగమైన నిల్‌గ్రార్ టన్నెల్‌లో తొలి బ్లాస్టింగ్ 2020 అక్టోబర్ 14న జరిగింది. అప్రోచ్ రోడ్లు, వంతెనలు, నిల్‌గ్రార్ జంట టన్నెల్లు, కట్‌అండ్‌కవర్ పనులు, స్నో గ్యాలరీలతో కూడిన మొదటి దశ గత ఏడాది మార్చి 15న పూర్తి ఐంది . ప్రధాన జోజిలా టన్నెల్ తుది బ్రేక్‌త్రూమంగళవారం జరగనుంది. జోజిలా టన్నెల్ నిర్మాణ ప్రాంతంలో 20 డిగ్రీల నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉంటాయి. ప్రతి ఏడాది వంద రోజుల పాటు అక్కడ ఇలాంటి వాతావరణమే ఉంటుంది. మంచు తుఫానులు ఇక్కడ సర్వ సాధారణం. అలాంటి విపత్కర పరిస్థితులను అధిగమిస్తూ 1200 మంది కార్మికులు టన్నెల్ నిర్మాణంలో భాగస్వాములు అయ్యారు. వీరిలో 80 శాతం మంది స్థానికులే.

### హిమపాతాల ముప్పు..

గత ఐదేళ్లలో జోజిలా టన్నెల్ నిర్మాణ ప్రాంతంలో ఐదు ప్రధాన హిమపాత ఘటనలు (మంచు తుఫానులు) చోటుచేసుకున్నాయి. వాటిలో రెండు అత్యంత తీవ్రమైనవి. వీటి వల్ల యంత్రాలు, పరికరాలు, వర్క్‌షాపులకు గణనీయమైన నష్టం కలిగింది. మూడేళ్ళ క్రితం సంభవించిన భారీ మంచు తుఫానులో ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతంలో పని చేసే 172 మంది కార్మికులు చిక్కుకుపోయారు. వారిని మన సైన్యం సురక్షితంగా బైటకు తీసుకొచ్చింది. తొలిసారి సర్బల్ ప్రాంతంలో 2023 జనవరి 12న భారీ హిమపాతం నమోదైంది . అదే నెల 15న రెండో భారీ హిమపాతం అనంతరం చిక్కుకుపోయిన 172 మంది కార్మికులను భారత సైన్యం రక్షించింది. 2024లో ఫిబ్రవరి నెలలో రెండుసార్లు, మార్చిలో మరోసారి హిమపాతాల కారణంగా అత్యవసర భద్రతా చర్యలు చేపట్టి మంచును తొలగించి పనులకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకున్నారు. భారీ మంచు పేరుకుపోయే శీతాకాలంలో చిన్న, పెద్ద స్నో బ్లోవర్లను వినియోగించి నిర్మాణ పనులు అంతరాయం లేకుండా కొనసాగించడంతో పాటు జాతీయ రహదారిని వాహనాల రాకపోకలకు టన్నెల్ నిర్మణ సంస్థ ఎం ఈ ఐ ఎల్ అందుబాటులో ఉంచింది. అత్యంత కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో కూడా 1 కోటి సేఫ్ మ్యాన్‌అవర్స్ ను ఈ ప్రాజెక్ట్ సొంతం చేసుకుంది.

### క్లిష్ట భౌగోళిక వచ్చినా ముందుకు సాగింది

జోజిలా లో నిర్మిస్తున్న 13 కిలోమీటర్ల ప్రధాన టన్నెల్ మార్గంలో రాతి నిర్మాణాల స్వభావం 67 సార్లు మారింది. మంచి నుంచి అత్యంత బలహీనమైన రాతి పొరల వరకు మారుతూ వచ్చిన ఈ సవాళ్లను నిపుణులైన ఇంజనీర్లు, సాంకేతిక సిబ్బంది విజయవంతంగా అధిగమించారు. టన్నెల్ పూర్తి చేశారు. టన్నెల్ నిర్మాణ ప్రాంతంలో 1,100 మందికి పైగా నివసించేలా పూర్తి సౌకర్యాలతో కూడిన ఆధునిక బేస్ క్యాంప్ ను ఎం ఈ ఐ ఎల్ ఏర్పాటు చేసింది. స్థానిక వాతావరణానికి అనుగుణమైన ఆహారం, వైద్య సేవలు, రవాణా, ఇతర సౌకర్యాలు ఈ క్యాంపులో అందుబాటులో ఉన్నాయి. వందలాది ట్రక్కులు, డజన్ల కొద్దీ లోడర్లు, ఎక్స్‌కవేటర్లు, బ్యాచింగ్ ప్లాంట్లు, క్రషింగ్ యూనిట్లు, ఆధునిక డ్రిల్లింగ్ బూమర్లు టన్నెల్ కోసం వినియోగిస్తున్నారు.

### అమర్‌నాథ్ యాత్రకు సహకారం..

ఏన్ . హెచ్ .ఐ .డి. సి .ఎల్ సమన్వయంతో ప్రతి సంవత్సరం నిర్వహించే అమర్‌నాథ్ యాత్రకు టన్నెల్ ప్రాజెక్టు నిర్మాణ బృందం విశేష సహకారం అందిస్తోంది. యాత్రికుల కోసం పార్కింగ్ సదుపాయాలు, మొబైల్ మరుగుదొడ్లు, బేస్ హాస్పిటల్‌కు అవసరమైన ఫ్లోరింగ్ ఏర్పాట్లు వంటి సేవలను అందిస్తూ యాత్ర సజావుగా సాగేందుకు కృషి చేస్తోంది.

### ప్రాజెక్టు విశేషాలు..

జోజిలా ప్రాజెక్ట్ మొత్తం పొడవు రోడ్లు, వంతెనలతో కలిపి 30.894 కి.మీ. ఇందులో జోజిలా ప్రధాన టన్నెల్ పొడవు 13.153 కి.మీ. నిల్‌గ్రార్ టన్నెల్ గి1 పొడవు 457.35 మీటర్లు. నిల్‌గ్రార్ టన్నెల్ గి2 పొడవు 1,953.63 మీటర్లు(సుమారు రెండు కిలోమీటర్లు)

ఈ ప్రాజెక్టులో ఉన్న మూడు వంతెనల పొడవు 460 మీటర్లు. భారతదేశంలోనే అత్యంత పొడవైన వెర్టికల్ షాఫ్ట్ ఇక్కడ నిర్మించారు. వెర్టికల్ షాఫ్ట్1 (పశ్చిమ) పొడవు 474.30 మీటర్లు. దీని ఎత్తు 3481 మీటర్లు. మధ్యలో నిర్మించిన వెర్టికల్ షాఫ్ట్2 పొడవు 367.38 మీటర్లు. తూర్పు వైపున నిర్మించిన వెర్టికల్ షాఫ్ట్3పొడవు 213.50 మీటర్లు. మొత్తం 2,350 మీటర్ల కట్‌అండ్‌కవర్ నిర్మాణాలు 7 ఈ ప్రాజెక్ట్ లో ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్ లో 450 మీటర్లు స్నో గ్యాలరీ కూడా ఉంది. జోజిలా టర్నల్ ప్రాజెక్టు విషయానికి వస్తే....

జోజిలా ప్రాజెక్ట్ లో ప్రధాన టన్నెల్ బ్రేక్ త్రూ మంగళవారం జూన్ తొమ్మిదన జరగనుంది. ఇందులో కీలకమైన నిల్‌గ్రార్ టన్నెల్ గి1 ట్యూబ్ 1 బ్రేక్ త్రూ 2021 నవంబర్ 4న, ట్యూబ్ 2 బ్రేక్ త్రూ నవంబర్ 22న, నిల్‌గ్రార్ టన్నెల్ గి2టి ట్యూబ్1 బ్రేక్ త్రూ 2022 మార్చి ఎనిమిదిన, నిల్‌గ్రార్ టన్నెల్ గి2 ట్యూబ్2 బ్రేక్ త్రూ 2022 ఏప్రిల్ 21న జరిగింది. టన్నెల్ లోని షాఫ్ట్3 బ్రేక్ త్రూ 2023 నవంబర్ 15న, షాఫ్ట్ 1 బ్రేక్ త్రూ గత ఏడాది జులై 28న జరిగింది . టన్నెల్‌లో ప్రత్యేక ఎస్కేప్ టన్నెల్ లేదు. అందువల్ల ఈ వెర్టికల్ షాఫ్ట్‌లు గాలి ప్రసరణ, అత్యవసర భద్రతా అవసరాలకు కీలకంగా ఉపయోగపడతాయి.

---

## పోలీస్ పీజీఆర్ఎస్ లో విప్లవాత్మక మార్పు

**ఏ1 ప్రజావాణి ద్వారా అర్జీల తయారీ**

**అనంతపురం క్రైమ్ జూన్ 8 ప్రభాతవార్త**



బాధితుల సమస్యలను వింటున్న జిల్లా ఎస్పీ జగదీష్

ప్రజా సమస్యల పరిష్కార వేదికైన "పోలీస్ పీజీఆర్ఎస్ లో జిల్లా పోలీస్ శాఖ సాంకేతికత వైపు మరో అడుగు ముందుకు వేసింది. బాధితులకు మరింత సులభంగా, పారదర్శకంగా సేవలు అందించేందుకు వీలుగా సరికొత్త "ఏ1ప్రజావాణి విధానాన్ని అందు బాటు లోకి తీసుకువచ్చింది. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జగదీష్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీదారుల నుండి మొత్తం 184 పిటిషన్లను ఎస్పీ స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు తక్షణ పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా 15 పిటిషన్లు సిద్ధం అయ్యాయి. తమ సమస్యలను లిఖితపూర్వకంగా రాయలేని అర్జీదారుల కోసం ప్రయోగాత్మ కంగా ప్రవేశపెట్టిన "ఏ1ప్రజావాణి అద్భుతమైన ఫలితాలను ఇచ్చింది. ఈ సరికొత్త వ్యవస్థ ద్వారా కేవలం మాటల రూపంలో సేకరించిన వివరాలతో 15 పిటిషన్లను చట్టబద్ధమైన ఫార్మాట్‌లో సిద్ధం చేశారు. ఇలా డిజిటల్‌గా త్వరితగతిన తయారైన 15 అర్జీలను బాధితులు నేరుగా ఎస్పీ గారికి సమర్పించగా, ఆయన వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి తక్షణ పరిష్కారానికి మార్గం సుగమం చేశారు. బాధితులు చదువుకోని వారైనా లేదా తమ సమస్యను లిఖితపూర్వకంగా రాయలేకపోయినా.. "ఏ1ప్రజావాణి వ్యవస్థ వారి మాటలను స్వీకరించి, అత్యంత ఖచ్చితమైన చట్టపరమైన అర్జీగా రూపొందించింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహబూబ్ బాషా, జిల్లా పోలీస్ కార్యాలయ డిపోకే సిబ్బంది, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీ కొని ఇద్దరు మృతి





రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బంగి నాగభూషణ, కుళ్ళాయప్ప

**బుక్కరాయసముద్రం, జూన్ 8 ప్రబాతవార్త**

బుక్కరాయసముద్రం మండల పరిదిలోని వెంకటాపురం గ్రామ సమీపలోని చెన్నంపల్లి క్రాస్ వద్ద సోమవారం జరిగిన యాక్సిడెంట్‌లో వెంకటాపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతిచెందాగా ఒకరు తీవ్రంగ గాయపడ్డారు.స్థానికులు అందించిన వివరాల మేరకు వెంకటాపురం గ్రామానికి చెందిన బంగి నాగభూషణ(44) తండ్రి బంగి పెద్దఎర్రెప్ప,కుళ్ళాయప్ప (35) తండ్రి కొండన్న,చాంద్‌బాష వారందరు దినకూలి చేజుకొని జీవనం సాగించేవారు.సోమవారం నార్పలలో కూలిపనికి పోయి తిరిగి ఇంటికి ద్విచక్రవాహన మీద వస్తుండగా చెన్నంపల్లి క్రాస్ వద్దకు రాగానే కేశేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తులు ద్విచక్రవాహనం మీద అనంతపురం నుండి నార్పలకు వెల్తుడంగా వేగంగ వచ్చి డీ కొట్టడంతో బంగి నాగభూషణ,కుళ్ళాయప్ప కు బలమైన గాయాలు కావడంతో నాగభూషణ అక్కడికి అక్కడే మృతిచెందగా కుళ్ళాయప్పను,చాంద్‌బాష కు తీవ్రగాయాలు కావడంతో అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కుళ్ళాయప్ప మృతిచెందాడు,బంగి నాగభూషణ కు భార్య నిర్మలా తోపాటు ఒక కుమారుడు ఒక కూతురు ఉన్నారు.కుళ్ళాయప్ప కు భార్య కృపాదేవి తోపాటు ఒక కూతురు ఒక కుమారుడు ఉన్నారు.కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ రెండు కుటుంబాలు దుఃఖసాగరంలో మునిగారు, ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతిచెందడంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి,పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు.

## యోగా మానసిక వత్తిడిని తగ్గించి ఏకాగ్రతతను పెంపొందిస్తుంది

**- ఎంపీడీఓ తేజోష్ణ వెల్లడి**



యోగా ఆసనాలను వేయిస్తున్న యోగా ట్రైనర్ సంధ్య.

**పామిడి, జూన్ 08 ప్రభాతవార్త**

మానసిక వత్తిడిని తగ్గించి ఏకాగ్రత పెంపొందిస్తూ సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహద పడుతుందని ఎంపీడీఓ తేజోష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ టిసి ఉన్నత పాఠశాలలో సోమవారం యోగా ట్రైనర్ సంధ్య ద్వార ప్రజలతో యోగా ఆసనాలను వేయించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ తేజోష్ణ మాట్లాడుతూ యోగాపై ప్రజల్లో అవగాహన పెంచటం, దైనందిన జీవితంలో యోగాను బాగం చేయటం ద్వార శారీరక మానసిక దృఢత్వాన్ని పెంపొందించటమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలిపారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర పేరిట ప్రత్యేక యోగా కార్యక్రమాలను చేపడుతుందని తెలియజేశారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రజలను యోగావైపు నడిపించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 9వ తేది నుండి 13వ తేది వరకూ పోలీస్‌స్టేషన్ నందు ప్రతిరోజూ సాయంత్రం సిబ్బందికి ఒక గంట, 14, 15వ తేదీల్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మద్యాహ్నం సిబ్బందికి ఒక గంట, 16న ప్రభుత్వ టిసి ఉన్నత పాఠశాలలో ఉపాద్యాయులకు ఒక గంట, 17, 18వ తేదీల్లో మేజర్ గ్రాపంచాయతీ కార్యాలయం నందు పనివేళల్లో సిబ్బందికి ఒక గంట, 19, 20వ తేదీల్లో డ్వాక్రా మహిళలకు ఉదయం ఒక గంట యోగాపై శిక్షణ 21న విద్యార్థులతో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించటం జరుగుతుందని వివరించారు. డిప్యూటీ ఎంపీడీఓ అశ్వర్థమనాయుడు మాట్లాడుతూ శారీరక మానసిక దృఢత్వం కోసం యోగా ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచటమే ముఖ్యఉద్దేశ్యంగా జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ బాగసాములు కావాలని పిలుపునిచ్చారు. యోగా ట్రైనర్ సంధ్య మాట్లాడుతూ యోగా అనేది మనస్సు శరీరం ఆత్మ కలయిక సమతుల్యతకు తోడ్పడే పురాతన భారతీయ జీవిన విధానం అన్నారు. యోగా ద్వారనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందంటూ యోగా చేయటం ద్వార కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వెల్లడించారు.

## అందుబాటులో యెజ్డీ స్క్రాంబ్లర్ 350, బిఎస్ఏ స్క్రాంబ్లర్ 650

**అనంతపురం కల్చరల్, జూన్ 8 ప్రభాతవార్త**




నూతన వాహనాలు దృశ్యం

యెజ్డీ, బిఎస్ఏలు తమ కొత్త స్క్రాంబ్లర్స్ రీటైల్ విడుదలను ప్రకటించాయి, అవి ఇప్పుడు హైదరాబాద్ తమ అధీకృత డీలర్ షిప్స్‌లో లభిస్తున్నాయి. నగరాల్లో సౌకర్యవంతంగా, జాతీయ రహదారులపై స్థిరంగా ట్రయల్స్‌లో ఉత్తేజకరంగా ఉండే వాహనం కోసం పరిశీలిస్తున్న రైడర్ కోసం, అసలైన స్క్రాంబ్లర్ వారసత్వం ఉన్న బ్రాండ్స్ వేరు ధరల్లో రెండు విలక్షణమైన మోటార్ సైకిల్స్‌ను అందిస్తున్నాయి. యెజ్డీ స్క్రాంబ్లర్ 350, బిఎస్ఏ స్క్రాంబ్లర్ 650లు ప్రత్యేకంగా రూపొందించిన పవర్ ట్రైయిన్స్‌తో పాటు శక్తివంతమైన, ఆకర్షణీయమైన డిజైన్‌ను కలిగి ఉన్నాయి. భారతదేశపు తేలికైన 350 సిసి స్క్రాంబ్లర్, చురుకైన యెజ్డీ స్క్రాంబ్లర్‌లు పట్టణంలో ప్రయాణించడానికి, వారాంతాల్లో విహారాల కోసం తీర్చిదిద్దబడ్డాయి. కొత్త లిక్విడ్ కూల్డ్ కటార్ ఇంజన్ అనేది మోటార్ సైకిల్ యొక్క క్రియాత్మక, నిర్మాణాత్మక కేంద్రం. ఇది రూ.1,99,950 పరిచయ ధరతో ప్రారంభమవుతోందని అనుపమ్ థరేజా, సహస్థాపకులు, క్లాసిక్ లెజెండ్స్ తెలిపారు. 4 సంవత్సరాలు 50,000కిమీ స్టాండర్డ్ వారంటీ, 6 సంవత్సరాల వరకు పొడిగించబడిన వారంటీ ఎంపికలు, ఒక ఏడాది వరకు రోడ్డు సైడ్ సహాయం దేశవ్యాప్తంగా 400 ప్లస్ సేల్స్, సర్వీస్ టచ్ పాయింట్స్‌ను మద్దతు చేస్తుందన్నారు.

## ఏపీ ఎయిమ్స్ ద్వారానే ఎరువుల విక్రయాలు

**డీలర్లకు వ్యవసాయ శాఖ శిక్షణ..**

**గార్లదిన్నె,జూన్08,ప్రభాత వార్త**




ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ ద్వారా రైతుకు యూరియా పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, డీలర్లు..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ చేప దుతున్నట్లు మం డల వ్యవసాయాధి కారి తెలిపారు. గౌరవ ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు మండలంలో ఈ విధా నాన్ని అమలు చేస్తు న్నట్లు పేర్కొ న్నారు. యాప్ ద్వారా రైతుల వివరాలు, గతంలో సాగు చేసిన పంటలు, ప్రస్తుతం సాగు చేయనున్న పంటల వివరాలను పరిశీలించి అవసరమైన మేరకు ఎరువులను దశలవారీగా పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు. దీంతో ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరుగుతుందనీ పేర్కొన్నారు.మండలంలోని ఎరువుల డీలర్లు యూరియా, డీఏపీ విక్రయాలను తప్పనిసరిగా ఏపీఎయిమ్స్ యాప్ ద్వారానే నిర్వహిం చాలని ఆదేశించినట్లు చెప్పారు. ఈ మేరకు మండలంలోని డీలర్లందరికీ యాప్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు వివరిం చారు. రైతులకు ఎరువులు సకాలంలో అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## సైన్స్ సెంటర్‌లో ఎంఈఓ-2, మండల ఇంజినీర్లు, హెచ్‌ఎంలకు సమావేశం



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**అనంతపురం న్యూటౌన్, జూన్ 8 ప్రభాతవార్త**

నగరంలోని సైన్స్ సెంటర్‌లో జిల్లాలోని అన్ని మండలాల మండల విద్యాశాఖ అధికారులు–2, మండల ఇంజనీర్లు, మండలానికి ఒక కాంప్లెక్స్ హెడ్మాస్టర్లకు మనబడి మన భవిష్యత్తులో చేయవలసిన పనుల గురించి అవగాహన కల్పించారు. ఇందులో సమగ్ర శిక్ష ఎపిసి టి.శైలజ మేడం మాట్లాడుతూ.. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు గుర్తించిన మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో కీలకమైన పది కాంపోనెంట్స్ ఎస్టిమేషన్స్ తొందరగా కంప్లీట్ చేయవలనని కోరడం జరిగింది. ఆర్ఓ ప్లాంట్‌స వెండర్స్‌ను పంపిన టెక్నీషియన్స్ ను పిలుచుకుని వారి చేత టెక్నికల్ మరమ్మత్తులు చేయించి ఆర్ఓ ప్లాంట్స్ ప్రతి పాఠశాలలో వర్కింగ్‌లో ఉండే విధంగా చూడవలెనని చెప్పారు. ఆర్ఓ వర్కింగ్ మీద ఎస్‌టిఎంఎస్ యాప్‌లో హెడ్మాస్టర్లు అందరూ అప్లోడ్ చేయవలెను. ఫేస్–2లో ఉన్న పాఠశాలల్లో ఆన్ గోయింగ్ వర్క్స్ 5 కాంపోనెంట్స్ ఏవైతే పెండింగ్‌లో ఉన్నాయో ఆ వర్క్స్ కంప్లీట్ చేయించవలెను. దీనిమీద ప్రతిరోజు మానిటర్ చేయటం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఇన్చార్జ్‌ని జయరాములు, మరొక ఇంజనీర్ గోపాలకృష్ణ, సీఎంఓ చంద్రశేఖర్, ఏపీవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పని ఒత్తిడితో వీఆర్వో లు విల...విల...

**నార్పల జూన్ 8, ప్రభాతవార్త**

నార్పల మండల కేంద్రంలోని స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు పని ఒత్తిడీ కారణం గా శాంతియుతంగా సోమవారం నిరసన కార్యక్రమాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వీఆర్వో శివరాం మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని ఒక వీఆర్వో పని ఒత్తిడి కారణంగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకునే మరణించడం జరిగిందన్నారు. కనీసం రెండో శనివారం, ఆదివారాలు చూడకుండా మాతో పని చేయించుకుంటూ సతమతం అయ్యేలా చేస్తున్నారు. 14 కు శాఖలకు సంబంధించిన పని భారం సచివాల ఉద్యోగంతో చేయించుకుంటున్నారు. ముఖ్యంగా పిజిఆర్ఎస్ కు సంబంధించి పని భారం ఎక్కువ అవుతుందన్నారు. దయచేసి మా పని ఒత్తిడిని తగ్గించాలని ఉన్నతాధికారులకు శాంతియుతంగా నిరసనని తెలియజేశారు.

## మాభూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయించండి

**జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను కోరిన రైతు లక్ష్మిరెడ్డి.**



అధికారులకు అర్జీ అందజేస్తున్న దృశ్యం.

**అనంతపురం రూరల్, జూన్ 08 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం కొడిమి గ్రామంలో ఉన్న మాభూమి ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయించాలని కోరుతూ రైతు లక్ష్మారెడ్డి జిల్లా కలెక్టర్ కు, జిల్లా ఎస్పీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమాకు కొడిమి పొలములో ఖాతా నెంబరు 284, సర్వే నెంబరు 178/4ఇ1ఇ లో మొత్తం 4 ఎకరాల20 సెంట్లు, అందులో చెరువు కాలువ, బండి రస్తాకి పోను లక్ష్మిరెడ్డి అనే నాకు 2,79 సెంట్లు భూమి పూర్వము మా తాత గార్ల నుండి ఈ భూమి వుందని ఈ భూమికి 1బి అడంగలు కలవు. ఈ భూమికి ఎ.డి.సి.సి. బ్యాంకు, అనంతపురములో మార్టిగేజ్ లోను కూడా వున్నది. ఇందువెంట కాపీని జతపరచడమైనది. ఈ భూమిసర్వేచేయించుకునేదానికి నేను, కొడిమి గ్రామం సర్వేయర్ మరియు వి.ఆర్.ఓ. సమక్షంలో చలానా కట్టినాను. చుట్టు ప్రక్కల భూముల రైతులకు నోటీసులు ఇచ్చి, సర్వేయర్ సర్వే చేయడానికి వచ్చినారు. మా ప్రక్కన సర్వే నెంబరు 178/4ఇడీ వారు డొక్కా నాగమ్మ, భర్త డొక్కా రామయ్య వీరి కుమారులు నాగార్జున, కుళ్ళాయస్వామి, శివ మరియు మిగతావారు సర్వేచేయకుండాఅడ్డుకుంటున్నారు. మా మీదకు దాడి చేయడానికి వచ్చినారు. మేము 112 కు డయల్ చేసినాము. పోలీసు వారు అక్కడికి వచ్చినా మాకు సర్వే చేయించలేదు. ప్రతివాదులు నన్ను అనేక విధాలుగా ఇబ్బంది పెట్టుతుంటే నేను జిల్లా కోర్టు కు పోయి జంక్షన్ ఆర్డర్ తెచ్చుకోవడం జరిగిందని, మా భూమికి చుట్టుపక్కలచెక్కుబందులు: తూర్పు కొడిమి గ్రామమునకు పోవు చెరువు కాల్వ,మరియు బండి రస్తా.పడమరఇతరులు జమీను. దక్షిణం: చెరువు కాల్వ మరియు బండి రస్తా.ఉత్తరం యస్. కాలి సాబ్, కనుంపల్లి అరుణ కుమార్ రెడ్డి, వై. గంగాధర్ రెడ్డి, వి. కీర్తి, డొక్కా నాగమ్మ, అద్ర పెదయ్య జమీనులు ఉన్నారని,కావున తమరు మాపై దయవుంచి పై విషయమును పరిశీలించి, మాకు తగు న్యాయము చేసి, మాకు రక్షణ కల్పించి, మా భూమికి హద్దులు చేయించాలని వారు జిల్లా కలెక్టర్, మరియు జిల్లా ఎస్ పి ని కోరారు.

## సలకం చెరువుకు సాగునీరు అందించండి

**శింగనమల, జూన్ 8 పభాతవార్త**



తహాశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

మండల పరిధిలోని సలకం చెరువు గ్రామానికి చెందిన చెరువుకు పెనకచర్ల డ్యాం, 5వ డిస్ట్రిబ్యూట్ కెనాల్ నుంచి నీరు వదలాలని బిజెపి మండల కన్వీనర్ బొమ్మన ఓబిరెడ్డి, తహాశీల్దారు శేషారెడ్డికి సోమవారం స్పందన కార్యక్రమంలో అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సలకం చెరువుకు వెళ్లే కాలువ ప్రస్తుతం శిథిలావస్తకు చేరిందని, వెంటనే అధికారులు స్పందించి కాలువలో పూడిక తీయించి, దెబ్బతిన్న గట్లు నిర్మించాలన్నారు. మరమ్మత్తులు చేపడితే చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే అవకాశం ఉందని, కావున నీటి పారుదల శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు.

# ఎడ్ల బండ్ల పోటీలు గ్రామీణ జీవన విధానానికి ప్రతీక..

- యువతలో సంప్రదాయాల పట్ల అవగాహన

గుంటిపల్లిలో ఎద్దులబండ్ల పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లె

- సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



ఎడ్ల బండి పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె

**కొత్తచెరువు, జూన్ 8 ప్రభాతవార్త**

గ్రామీణ ప్రాంతయువతలో మనసంస్కృతి సంప్రదాయాలు వారసత్వాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత ని ఎడ్ల బండి పోటీలు గ్రామీణ జీవన విధానానికి ప్రతీక అని ఎమ్మెల్యే పల్లెసింధూరరెడ్డి పేర్కొన్నారు కొత్తచెరువు మండలం గుంటిపల్లి గ్రామంలో బి.నవీన్ కుమార్ మరియు గ్రామస్తుల ఆధ్వర్యంలో సాంప్రదాయ ఎద్దుల బండ్ల పరుగు పోటీలను నిర్వహించారు ఈ పోటీలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి పుట్టపర్తిఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న గంగమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ,గ్రామీణ సంప్రదాయాలు, సంస్కృతి, వారసత్వాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. .మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ,గ్రామీణ క్రీడలను, సాంప్రదాయ కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారా మన సంస్కృతిని భావితరాలకు అందించగలమన్నారు. పోటీల నిర్వాహకులు కృషి చేసిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాశాప్సి ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి సామక్కోటి ఆదినారాయణ , టిడిపి సీనియర్ నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు, బుక్కసముద్రం చెరువు సాగునీటి సంఘం అధ్యక్షులు బి .నవీన్ ,సహకార సొసైటీ అధ్యక్షులు హరిప్రసాద్ , కన్వీనర్ రామకృష్ణ, మాజీ సర్పంచ్ శివప్రసాద్ , రిటైర్డ్ టీచర్ నాగేంద్ర ప్రసాద్ రైతు సంఘం మండల అధ్యక్షులు పివి రమేష్ , శ్రీనాథ్ సుధాకర్ ,సురేష్, నాయుడు ,గ్రామ పెద్దలు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

# జంబులదిన్నెలో ఎరువుల పంపిణీ..



ఎరువుల పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి తదితరులు..

**గార్లదిన్నె జూన్ 08 ప్రభాత వార్త :**

రైతులకు నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని జంబులదిన్నె పీఏసీఎస్ కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఎంపీ, ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై) ద్వారా జిల్లాలో వ్యవసాయ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందన్నారు. యూరియా, డీఏపీ ఎరువులపై కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఎరువుల నిల్వలు, లభ్యత వివరాలను ఏపీఎయిమ్స్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అనంతపురం జిల్లాను "ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియా"గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. సాగునీటి వసతుల విస్తరణ, ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహం, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కార్గో విమానాశ్రయం వంటి కార్యక్రమాలు రైతులకు ప్రయోజనం చేకూరుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, మాజీ జెడ్పీటీసీ రామలింగారెడ్డి, ఇల్లూరు రామాంజినేయులు, పాండు రంగనాయకులు, గేట్ కృష్ణారెడ్డి, శేఖర్, ఏపీకాబ్ అధికారులు, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం..!

**ధర్మవరం రూరల్ జూన్ 8 ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

రైతుల భూములపై సంపూర్ణ హక్కులను పరిరక్షించడమే ప్రభుత్వ ధ్యేయమని, రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ధర్మవరం మండలంలోని సుబ్బారావుపేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని 309 మంది రైతులకు పాస్‌పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ స్వామిత్వ పథకం కింద డ్రోన్ సాంకేతికతతో గ్రామాల రీసర్వే నిర్వహించి భూముల సరిహద్దులను ఖచ్చితంగా గుర్తిస్తున్నట్లు తెలిపారు. దీంతో భూవివాదాలకు అడ్డుకట్ట పడటంతో పాటు రైతులకు న్యాయబద్ధ హక్కులు కల్పించబడుతున్నాయని పేర్కొన్నారు. క్యూఆర్ కోడ్ విధానం ద్వారా భూమి వివరాలను సులభంగా తెలుసుకునే అవకాశం కల్పించామని చెప్పారు. ధర్మవరం నియోజకవర్గంలో విద్యుత్ రంగ అభివృద్ధికి ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద రూ.56.58 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా మెరుగుదలకు రూ.3.44 కోట్లతో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, చిగిచెర్ల వద్ద రూ.36.99 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణం జరుగుతోందన్నారు. జల్ జీవన్ మిషన్ కింద ధర్మవరం మండలంలో రూ.9.95 కోట్లతో తాగునీటి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ రహదారుల అభివృద్ధికి పలు రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో ఏరియా ఆసుపత్రి అభివృద్ధి, ఆయుర్వేద కళాశాల, డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ధర్మవరం రూరల్ మండలానికి చెందిన 120 మందికి రూ.1.71 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, ఎమ్మార్వో సురేష్, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న మంత్రి సత్య కుమార్ యాదవ్

# మొహారం సందర్భంగా చెట్లు నరకకుండా చూడాలి

## జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



అధికారులకు సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

**అనంతపురము కలెక్టరేట్ జూన్ 08 ప్రభాతవార్త**

మొహారం పండుగ సందర్భంగా చెట్లు నరకకుండా చూడాలని జిల్లాకలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో మొహారం పండుగ నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలను, చెట్లను, వృక్షములను కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. చెట్లవల్ల మనం పీల్చే ప్రాణవాయువు ఆక్సిజన్ అందిస్తాయని, వీటిని కాపాడటం అంటే మనఉనికి మనం కాపాడుకావడమే అని, చెట్లు గాలిలోని కార్బండయోక్సైడ్ మరియు విషవాయువులను పీల్చుకొని గాలిని శుద్ధి చేస్తాయన్నారు. చెట్లు సమృద్ధిగా ఉన్న చోట వర్షాలు సకాలంలో పడతాయని, ఇవి మేఘాలను ఆకర్షించి భూమిని చల్ల బరుస్తాయని, భూతాపం పెరగకుండా చెట్లు అడ్డుకుంటాయని, ఇవి భూమిపై ఉష్ణోగ్రతను నియంత్రణలో ఉంచుతాయన్నారు. ఫలాలు మరియు ఆహారం, పండ్లు, పూలు, గింజలు, కాయగూరలు వంటి ఆహారాన్ని చెట్లు ప్రసాదిస్తాయన్నారు. చెట్లు పక్షులకు, జంతువులకు, కీటకాలకు అవసాలుగా, నివాసాలుగా పనిచేస్తాయని, చెట్లు లేకపోతే ఎన్నో జీవరాసులు అంతరించిపోతాయని, ఇది చివరకు పర్యావరణ చక్రం దెబ్బ తినడానికి దారితీస్తుందని, ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మన్నని ఆపదల నుండి కాపాడుతుందన్నారు. మన సంప్రాదయ వేప, రావి, జువ్వి, మర్రి, జమ్మి, వృక్షలను నరకడం వల్ల రాబోయే 2030 సంవత్సరములు పర్యావరణ దుష్ప్రభావాలను ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, అటవీ శాఖ అధికారులు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో తాగునీటికి శాశ్వత పరిష్కారం

**రాయదుర్గం జూన్ 8 ప్రభాతవార్త**

పట్టణంలో తాగునీటి సరఫరా మెరుగుపరచడంతో పాటు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం పలు కీలక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. రాయదుర్గం పట్టణంలోని 29వ వార్డు పరిధిలో శుద్ధిచేసిన తాగునీటి సరఫరాను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అమృత్-2 పథకం కింద సుమారు రూ.78 కోట్ల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి ప్రాజెక్టు పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత శివారుకాలనీలతో సహా పట్టణంలోని ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటివరకు మంచినీటి సౌకర్యం అందని 27, 28, 29 వార్డులోని పలు ప్రాంతాలకు నేటి నుండి మంచినీటి సరఫరా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కనేకల్ రోడ్డు నుంచి శాంతినగర్ వరకు రూ.30 లక్షల వ్యయంతో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ పైప్‌లైన్ వల్ల నీటి సరఫరా సామర్థ్యం పెరగడంతో పాటు నిల్వ ట్యాంకులు నిండేందుకు పట్టే సమయంలో సుమారు మూడు గంటల మేర ఆదా అవుతుందని తెలిపారు. అందువల్ల మూడు వార్డుల్లో రూ. పాతిక లక్షలతో పైపులైను, రోడ్డు మరమ్మత్తులు చేస్తున్నామన్నారు. దీనివల్ల భవిష్యత్తులో మరిన్ని గృహాలకు కొత్త కొళాయి కనెక్షన్లు మంజూరు చేసే అవకాశం కూడా ఏర్పడిందన్నారు. రాయదుర్గం పట్టణ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, అమృత్-2 ప్రాజెక్టు పూర్తయిన తర్వాత పట్టణ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందేలా అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, మాజీ కౌన్సిలర్ బుళ్లారి జ్యోతి, మాజీ చేనేత డైరెక్టర్ నాటకశాల హనుమంతు, క్లస్టర్లు పోరాళ్ల పురుషోత్తం, ఇనాయత్, వేణు,కొండాపురం శ్రీనివాసులు, పై తోట రామంజి,గుద్దిటి లోకేష్, బండి భారతి, ప్రశాంతి,దబ్బిడి శివ, డాక్టర్ ఛన్నవీర , మంత సీన,కంబ్లీ రాజశేకర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

**పుట్టపర్తి టౌన్, జూన్ 08, ప్రభాతవార్త**

పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఒకసారి వచ్చిన సమస్య మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. సమస్యలు తిరిగి వస్తే సంబంధిత అధికారులు, సిబ్బందే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధుల బాధ్యత అని అన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# భారీగా పెరిగిన మొబైల్ ఫోన్ల ధరలు..!

- ప్రతి స్మార్ట్ మోబైల్ ఫోన్‌పై 20 నుంచి 30శాతం ధరల పెరుగుదల
- పెరిగిన ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, బ్యాటరీలు, హార్డ్ డిస్కుల ధరలు
- మోబైల్ ఫోన్లలో వినియోగించే మెమోరీ చిప్ ధరల పెరుగుదలే కారణం
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, రూపాయి మారకం విలువ పడిపోయి ఈ పరిస్థితి
- కొత్త మొబైల్ కొనాలంటే భయపడుతున్న సామాన్య మధ్యతరగతి ప్రజలు



**ఉరవకొండ, జూన్ 8 ప్రభాతవార్త**

స్మార్ట్ మొబైల్ ఫోన్ల ధరలు భారీగా పెరుగుతూ బంగారం, వెండితో పోటీ పడుతున్నాయి. గడిచిన ఏడెనిమి నెలల కాలంగా ఒక్కో మొబైల్ ఫోన్‌పై ఆయా కంపెనీలు 20 నుంచి 30శాతానికి పైగా ధరలు పెంచేశాయి. ఉదాహరణకు ఇదివరకు 10,000 రూపాయలు ఉన్న ఒక మొబైల్ ఫోన్ నేడు దాదాపు 14,000 రూపాయలకు చేరుకుంది. కొత్త మొబైల్ ఫోన్ కొనగోలు చేయాలంటే పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. మొబైల్ ఫోన్లలో ప్రధానంగా వినియోగించే మెమోరీ చిప్‌ల ధరలు భారీ పెరగడం, వాటిని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడం, అంతర్జాతీయంగా రూపాయి మారకం విలువ భారీ పడిపోవడం, పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఉద్రిక్తతలు నెలకొనడమే ఇందుకు కారణమని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఫలితంగా కొత్త మొబైల్ ఫోన్ల కొనగోల్లు భారీగా పడిపోయినట్లు తెలుస్తోంది. వివరాల్లో వెళితే... నేటి ఆధునిక ప్రపంచంలో ఏదున్నా లేకపోయినా ప్రతి ఒక్కరికీ మొబైల్ ఫోన్ అన్నది తప్పనిసరి అయిపోయింది. చేతిలో స్మార్ట్ మొబైల్ ఫోన్ ఉంటే చాలు ప్రపంచం మన అరచేతిలోకి వచ్చేసినట్లేనని చెప్పనవసరం లేదు. ఒక కుటుంబంలో ఎంత మంది సభ్యులుంటే అంతమంది వద్ద నేడు మొబైల్ ఫోన్లు ఉంటున్నాయి. కొందరికి మొబైల్ ఫోన్ అనేది వృత్తి, వ్యాపారం, విద్యకు అవసరమైన సాధనం కాగా మరికొందరు సంపన్న వర్గాలవారికి అది విలాస వంతమైన వస్తువుగా మారిపోయింది. గత10 సంవత్సరాల క్రితం వరకు నూటికి 10 మంది వద్ద మాత్రమే మొబైల్ ఫోన్లు కనిపించే పరిస్థితులు ఉండగా నేడు నూటికి 90శాతం మంది వద్ద మొబైల్ ఫోన్లు కనిపిస్తున్నాయి. దీంతో మొబైల్ ఫోన్ల వ్యాపారం భారీగా పెరిగింది. దీంతో ఇదివరకు పట్టణాలకే పరిమితమైన మొబైల్ షోరూమ్‌లు మండల కేంద్రాల్లో వెలుస్తున్నాయి. మొబైల్ కంపెనీలు రోజుకో కొత్త మోడల్ స్మార్ట్ ఫోన్‌ను ఆవిష్కరించి వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. దాదాపు కీ ప్యాడ్ ఫోన్లు కనుమరుగవుతుండగా స్మార్ట్ మొబైల్ ఫోన్లలో నేడు 4జీ, 5జీ అంటూ ఇంటర్నెట్ స్పీడ్‌ను అందిపుచ్చుకునే మొబైల్ ఫోన్లు అధికమయ్యాయి. వాటిలో ర్యామ్ (రాండమ్ యాక్సెస్ మెమోరీ), ఇంటర్నల్ మెమోరీ (రోమ్) జీబీలు ఎక్కువ కెపాసిటీతోపాటు బ్యాటరీ, కెమెరా మెగాపిక్సల్ ఎంత ఎక్కువగా ఉంటే ఆ మొబైల్ ఫోన్ ధర అంత పెరుగుతూ పోతుండటం మనం గమనించవచ్చు. అయితే గత ఏడెనిమి నెలల కాలంగా మొబైల్ ఫోన్ల ధరలు అమాంతం పెరిగిపోవడంతో కొనగోల్లుపై భారీగా దెబ్బపడినట్లు తెలుస్తోంది. ఒక మొబైల్ ఫోన్‌కు కీలకమైన మెమోరీ చిప్‌ల ధరలు విపరీతంగా పెరిగిపోవడం వాటిని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి స వస్తుండటంతో మొబైల్ కంపెనీలు స్మార్ట్ మొబైల్ ఫోన్ల ధరలను భారీగా పెంచేశాయని తెలుస్తోంది. స్మార్ట్ మొబైల్ ఫోన్లతోపాటు మెమోరీ చిప్‌లతో నడిచే ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, సీపీయులు, బ్యాటరీలు ఇలా విడిభాగాల ధరలు సైతం నేడు చుక్కలనంటుతున్నాయి. ఒకవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, మరోవైపు రూపాయి మారకం అమెరికన్ డాలర్‌తో పోలిస్తే 90 రూపాయల మార్కు దాటి భారీగా పతనం కావడంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయని తెలుస్తోంది. ఒకవైపు యుద్ధం కారణంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, సీఎన్‌జీ భారీగా పెరగడం పర్యావసానంగా నిత్యవసరాలు, కురగాయల ధరలు నేడు చుక్కలనంటుతుండగా వాటికి తోడుగా స్మార్ట్ మొబైల్ ఫోన్లు, కీ ప్యాడ్ ఫోన్లు, మెమోరీ కార్డులు, పవర్ బ్యాంకులు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ల ధరలు రోజు రోజుకూ పెరిగిపోతుండటంతో అన్నివర్గాలు ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. కొత్త విద్యా సంవత స రం ప్రారంభమవుతుండగా విద్యార్థులకు ప్రాజెక్టు వర్కులు, ఆన్‌లైన్ తరగతులు, ఆన్‌లైన్ పరీక్షలకు స్మార్ట్ మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు అత్యవసరంకాగా వాటిని తమ పిల్లలకు ఇప్పించడానికి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వీటి ధరల క్రమబద్ధీకరణకు ప్రభుత్వాలు అవసరమైన చర్యలు చేపట్టాల్సి ఉంది.

# మారుతీ నగర్ ।వ రోడ్డులో ఆపరేషన్ క్లీన్ స్వీప్ పై అవగాహన



క్లీన్ స్వీప్ పై అవగాహన కల్పిస్తూ ర్యాలీలో పాల్గొన్న కమిషనర్, సిబ్బంది

**అనంతపురం జూన్ 8 ప్రభాతవార్త**

నగరపాలకసంస్థ కమిషనర్ జస్వంత రావు ఆధ్వర్యంలో పారిశుధ్యానికి సంబంధించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ పై అవగాహన కార్యక్రమం మారుతీ నగర్ 1వ క్రాస్ లో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం చెత్త నిర్వహణ, చెత్తను వేరుచేసి ఇవ్వాలన్న అంశం పైన ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా రామ్ నగర్ ఫ్లైఓవర్ ఇరువైపులా సర్వీస్ రోడ్లలో ఉన్న నిర్మాణ వ్యర్థాల మట్టిని తలగింపజేసి,పారిశుధ్య పనులను చేపట్టడం జరిగినది. నగరంలోని వ్యాపారస్తులు తమ వ్యాపార సముదాయాలలో చెత్త బుట్ట లను ఏర్పాటు చేసుకొని చెత్తను నగరపాలక సంస్థ వాహనం వచ్చినప్పుడు ఇవ్వాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. నగర ప్రజలందరూ సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడరాదని, వాటికి ప్రత్యామ్నాయంగా బట్టలతో తయారుచేసిన సంచులు గాని ఇతరత్రా లను ఉపయోగించుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 2వ సర్కిల్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ నాగరాజు, స్వచ్ఛంద ।నిది కోఆర్డినేటర్లు వెంకటేశు, గోకుల్, సంబంధిత శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలు,పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# వృద్ధులు, వికలాంగులు, మహిళల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత

## జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



వృద్ధుల వద్దకు స్వయంగా వెళ్లి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ దృశ్యం

**పుట్టపర్తి, జూన్ 08, ప్రభాతవార్త**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమం ద్వారా అందే ఫిర్యాదులలో వృద్ధులు వికలాంగు లు మహిళల ఫిర్యా దులకు మొదటి ప్రధానిగా ఇస్తున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలియజేశారు. జిల్లా పోలీసు కార్యాల యంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ప్రజల నుండి నేరుగా 80 ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వృద్ధులు, వికలాంగుల ఇబ్బందులను గుర్తించిన ఎస్పీ స్వయంగా వారి వద్దకు వెళ్లి ఫిర్యాదులను పరిశీలించి న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత పోలీసు అధికారులకు పంపించి, సమగ్రవిచారణ అనంతరం చట్టపరంగా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూవివాదాలు, ఆస్తితగాదాలు, కుటుంబకలహాలు, భార్యాభర్త లమధ్య విభేదాలు, మోసాలు,ఇతర సామాజిక సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను అందజేశారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా పరిశీలించి చట్టబద్ధమైన పరిష్కారం అందించేందుకు జిల్లా పోలీసు శాఖ కృషి చేస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అంకిత, ఎయిర్‌పోర్ట్ సీఐ బొజ్జప్ప, డీటీఆర్‌బీ సీఐ లక్ష్మీకాంత్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, జిల్లా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసుల సంక్షేమానికి కృషి

## - జిల్లా ఎస్‌పి జగదీష్

**గుత్తి, జూన్ 8 ప్రభాతవార్త**

జిల్లా వ్యాప్తంగా పోలీసుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కృషి చేస్తున్నామని జిల్లా ఎస్‌పి జగదీష్ పేర్కొన్నారు. గుత్తి పట్టణంలో ప్రభుత్వ వైద్యశాల ఎదురుగా ఉన్న పాత పోలీస్ క్వార్టర్స్ మైదానంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి ఆయన సోమవారం భూమి పూజ గావించారు. పోలీస్ వెల్ఫేర్ సొసైటీ మరియు భారత్ పెట్రోల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో 95 లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఈ పెట్రోల్ బంకును ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ 45 రోజుల్లో నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి ఇలియాజ్‌బాషా, గుంతకల్ డిఎస్‌పి శ్రీనివాస్, ఏఆర్ డిఎస్‌పి నీలకంఠేశ్వర్‌రెడ్డి, బీపీసీఎల్ సేల్స్ మేనేజర్ లక్ష్మీ, అర్బన్ సిఐ రామారావు, ఎస్ఐలు సురేష్, అమీర్‌ఖాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా ఎస్‌పి భూమి పూజ చేస్తున్న దృశ్యం

# పేదల జీవనోపాధిపై ప్రభుత్వ విధానాలు దృష్టి సారించాలి

## - కాంగ్రెస్ నాయకులు చల్లపల్లి వీరయ్య చౌదరి

**కళ్యాణదుర్గం, జూన్ 8 ప్రభాతవార్త:**

నిత్యావసర వస్తువుల ధరలు, వంటగ్యాస్ ధరల పెరుగుదల వంటి అంశాలు సామాన్య ప్రజల జీవన వ్యయంపై ప్రభావం చూపుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు చల్లపల్లి వీరయ్య చౌదరి పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు పెరుగుతున్న ఖర్చులను ఎదుర్కో వడంలో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాయని ఆయన అన్నారు. సోమవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ ఉపాధి అవకాశాల విస్తరణ, సామాజిక భద్రతా పథకాల బలోపేతం, ప్రభుత్వ విద్యా మరియు వైద్య సేవల నాణ్యత పెంపు వంటి అంశాలపై ప్రభుత్వాలు మరింత దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. పెన్షన్లు, రేషన్ వంటి సంక్షేమ పథకాలు అవసరమైనవే అయినప్పటికీ, స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని అభిప్రాయ పడ్డారు. దేశ అభివృద్ధి సూచికలు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలతో ముడిపడి ఉండాలని, బడుగు బలహీన వర్గాల సంక్షేమం ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గేందుకు సమగ్ర సంక్షేమ, ఉపాధి మరియు విద్యా విధానాలు అవసరమని అన్నారు. యువత సామాజిక, ఆర్థిక, విద్యా అంశాలపై అవగాహన పెంపొందించు కోవాల్సి న అవసరం ఉందని, ప్రజా విధానాలపై నిర్మాణాత్మక చర్చలు జరగడం ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పాటు అందుతుందని వీరయ్య చౌదరి తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల, సమాన అవకాశాల కల్పన మరియు మానవీయ దృక్పథంతో కూడిన పాలన ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.